imma™

# Sakshi

## Metro Rail Project by 2013

**Date: 16-04-2010 | Edition: Bangalore | Page: 7 | Source: Bureau | Clip size (cm): W: 28 H: 18**

Clip: 1 of 1

### 2013 నాటికి..

# ‘మెట్రో’ పనులు పూర్తి

**అప్ప వెల్లడి..**

- మెట్రో రైలు పనుల్లో మేమే ఫాస్ట్
- బెంగళూరుకు అంతర్జాతీయ స్థాయి తెస్తాం
- మరో మూడేళ్లలో రూ. 18, 872 కోట్లతో నగరాభివృద్ధి
- రూ.200 కోట్లతో చెరువుల పునరుద్ధరణ
- స్థానిక ఎన్నికల్లో గెలుపు బాధ్యత ఎమ్మెల్యేలదే

బెంగళూరు, న్యూస్‌లైన్ :

నగరంలో అన్ని దశల మెట్రో రైలు పనులు 2013 మార్చి నాటికి పూర్తవుతాయని ముఖ్యమంత్రి యడ్యూరప్ప వెల్లడించారు. స్థానిక మల్లేశ్వరంలోని సంపిగె రోడ్డులో మంత్రి మాల్ వద్ద గురువారం ఆయన మెట్రో రైలు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబరు నాటికి బయ్యప్పనహళ్లి నుంచి చిన్నస్వామి స్టేడియం వరకు ఏడు కిలోమీటర్ల దూరం మెట్రో రైలు సంచారం ప్రారంభమవుతుందన్నారు. ఇక్కడ 80 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్న మెట్రో రైల్వేస్టేషన్ 20 నెలల్లో పూర్తవుతుందని తెలిపారు. మంత్రి డెవలపర్స్ భాగస్వామ్యంతో దీనిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. నగరంలో ప్రాథమిక సదుపాయాల కల్పన పనులు గడువులోగా పూర్తయితే ఖర్చు తగ్గడంతో పాటు ప్రజలకు అనుకూలంగా కూడా ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వాలతో పోల్చుకుంటే మెట్రో రైలు పనులు బీజేపీ హయాంలోనే వేగంగా జరిగాయన్నారు. మోనో రైలు, సర్క్యూట్ రైళ్లను కూడా ప్రారంభించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని యోచిస్తున్నామని చెప్పారు. బెంగళూరును అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. వచ్చే మూడేళ్లలో రూ. 18, 872 కోట్ల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. నగరంలో భూగర్భ జలాల పెంపునకు రూ.200 కోట్ల వ్యయంతో 25 చెరువులను పునరుద్ధరించి, అభివృద్ధి పరచనున్నట్లు చెప్పారు. బిడది వద్ద 1,400 మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించనున్నామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు డీబీ. చంద్రేగౌడ, పీసీ. మోహన్, ఎమ్మెల్యేలు దినేశ్ గుండూరావు, అశ్వత్థ నారాయణ, మంత్రి డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ మంత్రి ప్రభృతులు పాల్గొన్నారు.



మెట్రో రైలు పనులను ప్రారంభిస్తున్న సీఎం యడ్యూరప్ప. చిత్రంలో ఎంపీలు చంద్రేగౌడ, మోహన్, మంత్రి డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ మంత్రి ఉన్నారు

**పంచాయతీ ఎన్నికలు అగ్ని పరీక్ష :**

రాబోయే గ్రామ పంచాయతీల ఎన్నికలు బీజేపీకి అగ్ని పరీక్షగా పరిణమించనున్నాయని ముఖ్యమంత్రి యడ్యూరప్ప తెలిపారు. విజయం సాధించడానికి అవసరమైన వ్యూహాన్ని రూపొందించాల్సిందిగా ఎమ్మెల్యేలకు పిలుపునిచ్చారు. నగరంలో గురువారం జరిగిన బీజేఎల్‌పీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎన్నికలను ప్రతిష్టగా తీసుకోవాలని, పార్టీ మద్దతుదారుల విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యేలను కోరారు. బీబీఎంపీ ఎన్నికల్లో గెలుపు పార్టీకి మరింత బలాన్నిచ్చిందన్నారు. పంచాయతీ ఎన్నికల్లో గెలుపు బాధ్యత ఎమ్మెల్యేలదేనని అన్నారు.

ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేస్తే గెలుపు సులభమవుతుందని ఆయన ఉద్బోధించారు. బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కేఎస్. ఈశ్వరప్ప మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలుపొందితే తదుపరి ఎన్నికలకు వారే మూల స్తంభాలవుతారని తెలిపారు. కనుక గెలుపునకు శ్రమించాలని ఎమ్మెల్యేలను కోరారు. ఎన్నికల్లో కార్యకర్తలు పోటీ చేస్తారని, వారి వల్లే అందరూ ఎమ్మెల్యేలయ్యారని అన్నారు. వారి గెలుపునకు శ్రమించడం ద్వారా రుణం తీర్చుకోవాలని ఆయన హితబోధ చేశారు. ప్రారంభంలో ఎమ్మెల్యే చంద్రశేఖర పాటిల్ రేవూర్ వృతికి సమావేశం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసింది.